

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య

ఆపరేషన్ కగార్ ఆదానీ, అంబానీ కోసమే

- నయా ఫాసిస్టు ధోరణులతో కేంద్ర ప్రభుత్వం
- ఆరు గ్యారంటీల అమలు హామీ ఏమైంది?
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కగార్ అదానీ, అంబానీ కోసమేనని, బిజెపి కేంద్ర ప్రభుత్వం నయా ఫాసిస్టు ధోరణులను అవలంబిస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయం కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ సంపద, ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు అప్పజెప్పాలనే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందన్నారు. మావోయిస్టుల పేరు మీద ఆదివాసులను చంపడం దుర్మార్గమని, వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు సమస్య రాజకీయ సమస్య అని, దీన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానివి డైవర్ట్ రాజకీయాలు

రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అనవసరమైన చర్చలు పెట్టి ప్రజా సమస్యలను డైవర్ట్ చేస్తోందని, ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వం చేయాల్సిన పనిని చేయాలని డిమాండ్ చేయకుండా ఈ చర్చల్లో బిఆర్ఎస్, బిజెపి భాగం పంచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. జహీరాబాద్ నిమ్జ్ భూములు, సంగారెడ్డి ట్రిబుల్ ఆర్ పేరుతో పేదల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏండ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం జులై 9న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. మల్లేశ్, ఎ. మాణిక్, కె. రాజయ్య, బి.సాయిలు, బి. రామచందర్, ఎం. నరసింహులు పాల్గొన్నారు.

బనకచర్లపై నేడు ఎంపిలతో భేటీ

- సిఎంతోపాటు కేంద్ర మంత్రుల రాక

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ఎంపిలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల ఎంపిలతో పాటు కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. బనకచర్ల వల్ల తెలంగాణకు జరుగుతున్న నష్టంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరిని ఎంపిలకు వివరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు నిర్మాణం చేపడుతోందని కేంద్రానికి ఎంత చెప్పినా పట్టించుకోవడంలేదనే అభిప్రాయంతో ఉన్న తెలంగాణ..ఈవిషయంలో కూడా ఎంపిలతో చర్చించనుంది.ఎపి ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల నీటి హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలంగాణ సర్కారు అంచనా. ప్రస్తుతం కేంద్ర జల సంఘం వద్ద ఉన్న గోదావరి–బనకచర్ల ప్రీఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అ అంశాల ఆధారంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యాచరణకు దిగింది. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. దీనికి సీఎం రేవంత్‌తోపాటు కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని సైతం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. బనకచర్ల డిపిఆర్‌కు కేంద్ర జల సంఘం అనుమతులు ఇవ్వకుండా అడ్డుకునేందుకు ఎంపిలకు ప్రత్యేకంగా పీపీటీ ఇస్తున్నట్టు తెలిసింది. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రేవంత్‌తోపాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను ఈనెల మూడున కలిసిన సంగతి తెలిసిందే. ఇందుకు సదరు కేంద్ర మంత్రి స్పందిస్తూ డీపీఆర్ ఇంకా అందలేదనీ, అది వచ్చాక నీటి కేటాయింపుల్లో ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, ట్రిబ్యునల్ తీర్పులు, అంతర్ రాష్ట్ర ఒప్పందాలతోపాటు 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాలను పరిగణనలోకి తీసుకున్నాకే సమీక్షిస్తామని సర్కారు అంటున్నది. మిగులు జలాలను వాడుకుంటే తెలంగాణ వారికి అభ్యంతరం ఎందుకంటూ మీడియాతో సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లకు కేంద్రం సానుకూలంగా ఉందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.



రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరి ష్కారం

- రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్‌రెడ్డి గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రెవెన్యూ సదస్సుల ద్వారానే భూ సమస్యలు పరిష్కారం జరుగుతాయని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్‌రెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బాసిత్ నగర్, జాస్తిపల్లి గ్రామాల్లో తహశీల్దార్ సిహెచ్ సుధాకర్, డిటి రఫీ ఆధ్వర్యంలో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు ఆయన హాజరై మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూభారతి చట్టాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తారని తెలిపారు. పేదల పక్షాన ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎకరాల్లోపు భూములకు 'రైతు భరోసా' జమ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మూడు ఎకరాల్లోపు భూమి ఉన్న 10.45 లక్షల మంది రైతులకుగానూ రూ.1,551.89 కోట్లు విడుదల చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఎకరాలతో సంబంధం లేకుండా త్వరలోనే మిగతా రైతులకు కూడా రైతు భరోసా' అందుతుందనీ, ఎవరూ నిరాశ పడాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో

కాళేశ్వరం మినిట్స్ ఇవ్వండి

- సర్కారుకు కమిషన్ లేఖ

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం మినిట్స్ ఇవ్వాలంటూ న్యాయ విచారణ కమిషన్ మరోమారు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆలస్యం చేయడాన్ని తప్పుబట్టింది. గత ప్రభుత్వంలోని క్యాబినెట్ మినిట్స్ ఇవ్వాలంటూ మూడోసారి లేఖ పంపింది. ఎన్నిసార్లు లేఖలు రాయాలంటూ సర్కారుపై కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. విచారణలో భాగంగా కెసిఆర్ స్టేట్‌మెంటు సైతం తీసుకుంది. అనంతరమే మూడోసారి లేఖ రాసింది. ఇంజినీర్లు ఓపెన్ కోర్టు స్టేట్‌మెంటు తర్వాత ఓసారి, ఐఎఎస్ అధికారుల విచారణ తర్వాత మరోసారి లేఖ రాసిన విషయం విదితమే. గతంలో రాసిన లేఖలకు పూర్తిస్థాయిలో కమిషన్‌కు సర్కారు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. కమిషన్‌కు మినిట్స్ ఇవ్వాలా ? వద్దా ? అనే అంశాన్ని క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా' నిధులను సోమవారం సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేసిన విషయం తెలిసిందే. తొలిరోజు రెండు ఎకరాల వరకు ఉన్న 41.25 లక్షల మంది అన్నదాతలకు రూ.2,349.83 కోట్లు జమయ్యాయి.

అత్యాధునిక వసతులతో గోశాలలు

- గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించండి
- ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సిఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై సిఎం మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారనీ, స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మరణిస్తున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సూచించారు. యాత్రికులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడబోదని సిఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సిఎంకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలి

- మోడ్రన్ దోబీ ఘాట్లను నిర్మించాలి
- కరెంట్ బిల్లుల బకాయిలు విడుదల చేయాలి
- రజక, క్షౌర వృత్తిదారుల మహాధర్నాలో వక్తలు

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేసి మోడ్రన్ దోబీ ఘాట్లను నిర్మించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజక, క్షౌర వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు జీవో నెంబర్ 2 ప్రకారం 2005 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం సుమారు 1,12,586 మందికి అమలు చేయడం ద్వారా వారు ఉపాధి పొందుతున్నారన్నారు. ఉచిత విద్యుత్ పథకానికి రజకులకు రూ.187 కోట్లు, నాయీ బ్రాహ్మణులకు రూ.43 కోట్ల విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయని, దాంతో విద్యుత్ శాఖ అధికారులు వృత్తిదారులే బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. కొన్నిచోట్ల కనెక్షన్లు కూడా తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో అద్దె షాపుల యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క వృత్తిదారుడికి రూ.60 నుంచి 70 వేల వరకు కరెంటు బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటికి వెంటనే ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేసి విద్యుత్ శాఖకు పూర్తిగా చెల్లించి జీరో బిల్లు అయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన 141 మున్సిపల్ పట్టణాల్లో మోడ్రన్ దోబీఘాట్లను ప్రస్తుత ప్రభుత్వం ఆపేసిందని, వీటన్నింటినీ వెంటనే పునరుద్ధరించాలని కోరారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ.. ఉచిత కరెంట్ పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించి కరెంటోళ్ల వేధింపులు ఆపాలన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో అర్హులైన రజక యువతకు ఇవ్వాలన్నారు. 50 ఏండ్లు నిండిన వృత్తిదారులందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.. : కూనంనేని, కోదండరామ్

రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, పరిష్కారానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. బిల్లుల బకాయిలు విడుదల చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, మోడ్రన్ దోబీఘాట్ల నిర్మాణం కూడా ప్రారంభమయ్యే విధంగా చూస్తామన్నారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ.. రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని ఏ ప్రభుత్వం కూడా ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వీరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు.. : దోసోజు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన రజక, నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు ఉచిత కరెంటు పథకానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు.



రాజపుష్ప 'క్లబ్ ఒడిస్సీ' ఆవిష్కరణ

ప్రజాశక్తి – హైదరాబాద్

ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన రాజపుష్ప ప్రాపర్టీస్ నార్సింగిలోని తమ ప్రధాన నివాస సముదాయం రాజపుష్ప ప్రావిన్షియాలో అతిపెద్ద లగ్జరీ క్లబ్‌హౌస్ క్లబ్ ఒడిస్సీని ఆవిష్కరించింది. దీనిని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, రాజపుష్ప ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. 1,00,000 పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న క్లబ్ ఒడిస్సీ, నివాసితుల కోసం ఆరోగ్యం, ఫిట్‌నెస్, విశ్రాంతి, సాంస్కృతిక, సామాజిక, జీవనశైలి కేంద్రంగా మారనుందని పి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి 23.75 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన 3,498 నివాస ప్రీమియం ప్లాట్లలో ఇప్పటికే 95 శాతం విక్రయించామన్నారు.

నెలవారీ లక్ష్యాలు పెట్టుకుని పనిచేయండి

పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ప్రతి ఒక్క ఉద్యోగి కూడా నెలవారీ లక్ష్యాలు పెట్టుకుని వాటిని పూర్తి చేసేలా పని చేయాలని ఆ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖపై మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్రీధర్‌ను మంత్రి అభినందించారు. అనంతరం పనుల పురోగతి, అమలవుతున్న అభివృద్ధి పనులు, హామ్ విధానంలో రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై హెచ్ఒడి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రెండున్నర కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో శాఖలోని ప్రతిఒక్కరూ బాధ్యతాయువతంగా పనిచేయాలని సూచించారు. మంత్రి నుంచి మల్టీపర్పస్ వర్కర్ వరకు అందరూ ఒక కుటుంబం గా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పర్చాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. శాఖలోని ఉద్యోగుల సమస్యలను క్రమపద్ధతిలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే 93 వేల గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓల బదిలీలు, వాహనాల అలవెన్స్ ఫైల్స్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హామ్ విధానం ద్వారా 18,472 కిలోమీటర్ల గ్రామీణ రోడ్లకు మహర్దశ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హామ్ ప్రాజెక్టుకు సంబంధించి మార్గదర్శకాలతో నేడో రేపో జీవో విడుదల చేస్తామని తెలిపారు. ఆ విధానం అమలవుతున్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు అధికారుల బృందాన్ని పంపాలని మంత్రి ఆదేశించారు. ఆ రెండు రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి హామ్ విధానాన్నీ మన రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. 15 రోజుల్లో టెండర్లు వేసే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఉపాధి నిధుల ద్వారా ఇప్పటికే రూ. 1800 కోట్ల పనులను మంజూరు చేశామని తెలిపారు. ఈ దఫా పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు పల్లెల్లో ఆస్తులను సృష్టించామని చెప్పారు. ఎంతోకాలంగా గ్రౌండింగ్ కానీ పనులను రద్దు చేయాలని ఆదేశించారు. త్వరలో పనుల జాతర కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. శ్రీధర్ మాట్లాడుతూ..ఎంతోమంది ప్రజలతో పెనవేసుకున్న శాఖ పంచాయతీరాజ్ శాఖ అని చెప్పారు. జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళల సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ విశేషంగా కృషిచేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క మార్గదర్శకత్వంలో ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

దేశంలోనే తెలంగాణ పోలీసులకు అగ్రస్థానం

- గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి
- రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి జితేందర్

దేశంలోనే తెలంగాణ పోలీసులకు అగ్రస్థానం ఉందని రాష్ట్ర డిజిపి జితేందర్ అన్నారు. కేసుల్లో కన్విక్షన్ శాతాన్ని గణనీయంగా పెంచి, ఫిర్యాదులకు న్యాయం చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. వికారాబాద్ జిల్లాలో డిజిపి మంగళవారం పర్యటించారు. ముందుగా జిల్లా ఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించి ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం మల్టీ జోన్–2 ఐజీపీ వి.సత్యనారాయణ, చార్మినార్ జోన్ డిఐజి తస్వీర్ ఇక్బాల్, జిల్లా ఎస్‌పి కె.నారాయణరెడ్డి, జిల్లా అదనపు ఎస్‌పిలు, డిఎస్‌పిలు, ఇన్స్‌పెక్టర్లతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డిజిపి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పలు కీలక ఆదేశాలు జారీ చేశామన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. జిల్లాలో ఎన్‌డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాష్ట్రంలో లేకుండా నిర్మూలించాలన్నారు. సరిహద్దు పోలీస్ స్టేషన్ల అధికారులు మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో నిరంతరం దాడులు నిర్వహించి మత్తు పదార్థాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించి వ్యాపారం చేసే వారిని, ఇసుక మాఫియాను, మట్కా, గేమింగ్ వంటి జూదాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, రాత్రి వేళల్లో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలోని హాట్ స్పాట్లను గుర్తించి ఆర్‌టిఎ, రెవెన్యూ, ఆర్అండ్‌బి, ఇతర అధికారులతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలు చేపట్టాలన్నారు.

IN THE COURT OF HON'BLE MACT-CUM-X ADDL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT :: L.B. NAGAR
O.P. No. 661 of 2024

Between:
K. Uppalaiah ...Petitioner
AND
A. Kiran Kumar Reddy & others ...Respondents

NOTICE

To
(R3) Policy Bazar rep. by its Manager Office at S-space, plot no.145/298A, Patrikanagar Hitech city main road, Huda techno enclave Hyderabad, T.S. 500081.
(R4) Bhaskar Babu Vaddey S/o. Satyanarayanamurthy Aged about 68 years, Driver of car br.no. AP 16CG 6667 R/o. Flat no.6, Sivasai Sadan, Brindavan colony Vijayawada urban, Krishna Dist. - 520010. A.P.

Please take notice that the above named petitioner has filed the above OP case against you & others for grant of compensation U/s. 166 of MV Act due to injuries sustained to him in the road accident. That the above case posted on **25-6-2025** at about **10:30** A.M for your appearance. If you fail to attend before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absence as per Law.

//BY ORDER OF THE COURT//
B.MAHESH
Advocates
Office at 4-9-530, Raja Rajeswari colony, Hayathnagar, R.R.District.

మహారాజశ్రీ 7th అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో ప్యామిలీ కోర్టు జడ్జి గారి కోర్టు
Crlmp.No. 381/2024 in M.C.No. 24/2017

Between:
తోట లక్ష్మీ అపర్ణ
Rep by. being miner & his mother
తోట షణ్ముక్ ...పిటీషనర్స్
Vs
తోట నాగ వెంకట బాలాజీ ...రెస్పాండెంట్స్

రెస్పాండెంటు: తోట నాగ వెంకట బాలాజీ S/o. పద్మనాభం, వయస్సు 40 సం॥, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ప్లాట్ నెం: 102, డోర్ నెం: 12-4-129/3, శ్రీ శ్రీనివాస సౌధాఘర్, వసుంధర హాస్పిటల్ దగ్గర, మూసాపేట, హైదరాబాద్, తెలంగాణ జిల్లా, పిన్: 500018

పై నంబరు దావాలోని రెస్పాండెంటు అయిన తోట నాగ వెంకట బాలాజీ అను వారికి ఎన్నిసార్లు కోర్టు వారు నుంచి నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారు నోటీసు అమలు కొరకు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. **ది. 30-06-2025 వ తేదీన** వాయిదా అయివున్నది. మీరు **ఉదయం 10-30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరు అవ్వగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బి.పి. చంద్రశేఖర్
ఏలూరు — అడ్వకేట్, ఏలూరు
తేది:17-06-2025 — సెల్: 94409 76368

పౌరహక్కుల కోసం ఢిల్లీలో పోరు

- ఇండియా కూటమిలోని పార్టీలతో నిర్వహించాలి
- ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలి
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- అమిత్‌షా...ఆకలి, దోపిడీ, అసమానతలు లేకుండా చేయగలరా?
- హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ మహాధర్నాలో పలువురు వక్తలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో మావోయిస్టులే లక్ష్యంగా కొనసాగుతున్న హత్యాకాండను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే ఆపాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పౌర హక్కులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాల్పుల విరమణను ప్రకటించాలనీ, మావోయిస్టులో శాంతి చర్చలు జరపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం పోరాటం స్ఫూర్తితో పౌరహక్కులు, ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ఢిల్లీలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వినతులు, విజ్ఞప్తులతో కేంద్రం దిగిరాదనీ, బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని చెప్పారు. ఇండియా కూటమిలోని పార్టీలను ఆహ్వానించి నిర్వహించాలని కోరారు. దేశంలో పేదరికం, అంతరాలు, ఆర్థిక అసమానతలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని స్పష్టం చేశారు. పాలకులు కమ్యూనిస్టులను చంపొచ్చు గానీ, కమ్యూనిజాన్ని నిర్మూలించలేరని అన్నారు. శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నాను నిర్వహించారు. శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి చంద్రకుమార్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ జి హరగోపాల్, కందిమళ్ల ప్రతాపరెడ్డి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

కేంద్రం అంతం చేయాల్సింది పేదరికాన్ని : తమ్మినేని

ఆపరేషన్ కగార్ అనేది మావోయిస్టులపై కేంద్రం సాగిస్తున్న యుద్ధంగా భావిస్తే పొరపాటని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మనిషి జీవించే హక్కును, ప్రశ్నించేతత్వాన్ని, ప్రశ్నించే గొంతుకను లేకుండా చేయడమే బిజెపి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మావోయిస్టులు కాబట్టి చంపేస్తున్నదనీ అనుకుంటే పొరపాటనీ, కల్బుర్గీ, గౌరీలంకేష్ మావోయిస్టులా?, వారినెందుకు చంపారని ప్రశ్నించారు. ప్రజాతంత్ర శక్తులు, ప్రశ్నించే వారిని అణచివేస్తున్నదనీ, బిజెపి రక్తంలోనే అది ఉన్నదని వివరించారు. మావోయిస్టుల సమస్యను శాంతి భద్రతల సమస్యగా చూడకుండా రాజకీయ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అంతం చేయాల్సింది మావోయిస్టులను కాదనీ, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని, పేదరికాన్ని, రాజ్యాహంకారాన్ని అని సూచించారు. రాజకీయ చిత్తశుద్ధితో పాలకులు ప్రయత్నించాలని కోరారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు, తుపాకులను చూపించి ఉద్యమాలను అణచలేరు అని చెప్పారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా సైద్ధాంతిక యుద్ధం జరగాలని అన్నారు. హిట్లర్, ముస్సోలిని సిద్ధాంతం ప్రత్యర్థులను చంపడమేననీ, దాన్నే మోడీ, షా అనుసరిస్తున్నారని చెప్పారు. మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం వల్ల ప్రజలు నల్లధనం, ఉద్యోగాలు, నిరుద్యోగం, అధిక ధరల గురించి మరిచిపోతున్నారని వివరించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను నిర్మూలించాలంటూ గోల్వాల్కర్ చెప్పారని గుర్తు చేశారు. ఆ తప్పుడు సిద్ధాంతాన్ని నిర్మూలించాలని అన్నారు. రైతాంగం స్ఫూర్తితో మావోయిస్టులపై దమనకాండకు వ్యతిరేకంగా పౌరహక్కులను కాపాడుకునేందుకు ఢిల్లీలో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉగ్రవాదులు లేకుండా చేస్తే సెల్యూట్ చేస్తాం : కూనంనేని

దేశంలో ఉగ్రవాదులు, నిరుద్యోగం, రైతులకు బాధల్లేకుండా చేస్తే కేంద్ర ప్రభుత్వానికి సెల్యూట్ చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కానీ ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులను లేకుండా చేస్తామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వారిని శిక్షించడానికి చట్టాలున్నాయనీ, న్యాయస్థానాలున్నాయని గుర్తు చేశారు. ఇంకా 11 మంది మావోయిస్టులన్నారనీ, వారిని చంపితే నక్సలిజం ఉండబోదంటున్నారని చెప్పారు. హిట్లర్, ముస్సోలిని లాంటి వారే కమ్యూనిస్టులను ఏం చేయలేకపోయారనీ, మోడీ, షా ఏం చేస్తారని అడిగారు. ప్రశ్నించేతత్వాన్ని, తిరుగుబాటును అణచివేయలేరని అన్నారు. మోడీకి భారత్‌కు బాస్, ఆయనకు ట్రంప్ బిగ్‌బాస్ అని చెప్పారు. ట్రంప్ చెప్పడం వల్లే పాకిస్తాన్‌తో యుద్ధాన్ని ఆపారని చెప్పారు. ఒక్క ఉగ్రవాదినైనా పట్టుకున్నారా?అని ప్రశ్నించారు. బేధాభిప్రాయాలను పక్కన పెట్టి ఎర్రజెండాలన్నీ ఒక్కటి కావాలని ఆకాంక్షించారు. అందరం ఒక్కటైతే ఎర్రకోట కమ్యూనిస్టులది అవుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగినట్టుగానే ఢిల్లీలోనూ ఈ వాణి వినిపించాలని అన్నారు. కార్పొరేట్ వ్యవస్థకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా కాపలాకుక్కలని విమర్శించారు. వెట్టిచాకిరీ ఆధునిక రూపంలో అమలవుతున్నదని చెప్పారు.

మావోయిస్టుల సమాధులను చూసినా పాలకులకు భయమే : కె నారాయణ

నక్సలైట్లను చూస్తే కాదు వారి సమాధులను చూసినా పాలకులు భయపడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. మావోయిస్టుల ముక్తి భారత్ కాదనీ, త్వరలోనే అమిత్ షా ముక్తి భారత్ వచ్చి తీరుతుందని చెప్పారు. దరిద్రం ముక్తి అని ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడానికి ప్రజా ఉద్యమం రావాలన్నారు. నక్సలైట్లు, ఉగ్రవాదులు వేరని అన్నారు.

చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం : ఎంపి మల్లు రవి

ఏ సమస్యకైనా చర్చల ద్వారానే పరిష్కారం దొరుకుతుందని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదమేర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధమంటూ ప్రకటిస్తే ప్రభుత్వం దాన్ని స్వాగతించాలని అన్నారు. కానీ వారిని నిర్మూలించటం ద్వారా సమస్య పరిష్కారం కాదని చెప్పారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాలువ సుజాత మాట్లాడుతూ.. అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టేందుకే మోడీ ప్రభుత్వం గిరిజనులను, నక్సలైట్లను అత్యంత కిరాతకంగా కాల్చి చంపుతున్నదని విమర్శించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైందన్నారు.

నక్సలైట్లపై దాడి మానవత్వానికి మచ్చ : దాసోజు శ్రవణ్

కేంద్రం చేపట్టింది ఆపరేషన్ కగార్ కాదనీ, ఆపరేషన్ కార్పొరేట్ల కబ్జా అని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం నక్సలైట్లపై చేస్తున్న దాడి మానవత్వానికి మాయని మచ్చ అని చెప్పారు. ఏ మనిషినీ, మరే వ్యక్తి చంపే హక్కును రాజ్యాంగం అనుమతించబోదని అన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు భిన్నంగా కేంద్రం వ్యవహారం : కోదండరామ్

చట్టాన్ని పక్కన పెట్టి, ప్రజాస్వామ్య విలువలకు భిన్నంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరించటం తగదని టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అత్యంత దుర్మార్గంగా మావోయిస్టులను చంపుతున్నదని చెప్పారు. ఈ పేరుతో ఆదివాసీలపై మారణహోమాన్ని సృష్టించటం తగదని చెప్పారు.

ఇదేం రామరాజ్యం.. మీరేం హిందూవులు : ఆర్ నారాయణమూర్తి

'ఇదేం రామ రాజ్యం..మీరేం హిందూవులు. మీకు యుద్ధనీతి ఎక్కడుంది. రాముడి గురించి గొప్పగా చెబుతారు కదా. యుద్ధంలో రావణాసురుడు అలసిపోతే "నీవు అలసి పోయావు కాబట్టి ఇప్పుడు నీతో యుద్ధం చేయలేను. తర్వాత చేస్తాను" అని రాముడు అన్న ఆదర్శవంతమైన మాటలు మీకు గుర్తులేవా? మహాభారతంలో యుద్ధం వద్దని కౌరవులతో స్వయంగా శ్రీకృష్ణుడు రాయభారం పంపిన సంగతి మీకు తెల్వదా? హిందూమతంలో చనిపోయిన మృతదేహానికి కర్మకాండలు నిర్వహించడం ఒక క్రతువు కదా..మరి నంబాల కేశవరావు, ఇతర మావోయిస్టుల భౌతికకాయాలను దహన సంస్కారాల కోసం ఇవ్వాలంటూ బంధుమిత్రులు అడిగినా మీకు పట్టదా? గొప్ప హిందూవులమని చెప్పుకునే మీరు వారి ఆదర్శాలను, మత క్రతువులను ఎందుకు పట్టించుకోరు?' ఇదేం రామరాజ్యం అంటూ'అని సినీనటుడు ఆర్ నారాయణమూర్తి విమర్శించారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల తీరును తప్పుపట్టారు. దోపిడీ ఉన్నంత కాలం పోరాటాలు పుట్టుకొస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు. దోపిడీ, అణచివేత, అసమానతల్లేకుండా చేయాలని చెప్పారు.

ఆదివాసీలతో చర్చలు జరపండి : నాగేశ్వర్

మావోయిస్టులు తుపాకులు కలిగి ఉన్నారనే కారణంతో చర్చలు జరపడానికి ఇష్టం లేకుంటే ఆదివాసీలతో జరపాలని మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకులు కె నాగేశ్వర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులోపాటు ఆదివాసీలను చంపడం సరైంది కాదని చెప్పారు. రాజ్యాంగం ద్వారా చర్చలు జరిపి ఆదివాసీ ప్రాంతాల్లో నెలకొన్న అల్లకల్లోలాన్ని ఆపాలని కోరారు. సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెజి రామచందర్, ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్‌యుసిఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సిపిఐ(ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్ ఆర్మీ నాయకులు డి రాజేశ్, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, తుడుం దెబ్బ నాయులు నగేశ్, మూవ్‌మెంట్ ఫర్ పీస్ నాయులు అబ్దుల్ అజీజ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు విమలక్క, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, మల్లు లక్ష్మి, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఇందిరా శోభన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి

సమస్య మూలాలు గుర్తించకుండా ఆదివాసులను మట్టుపెట్టడమా..?

- మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు చేపట్టాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యలను పరిష్కరించాలంటే దాని మూలాలను గుర్తించాలని.. అందుకు విరుద్ధంగా కొన్ని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఆదివాసీలను మట్టుపెట్టడం, మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత చర్యలు చేపట్టడాన్ని తప్పు పట్టారు. మావోయిస్టులతో చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టులు శాంతియుత చర్చల కోసం ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా.. వారిని మట్టుపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం యత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీలను, మావోయిస్టులను చంపుతూ ఆపరేషన్ కగార్ విజయవంతమైందన్న పేరుతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకుంటున్నారని, దేశ ప్రజలను చంపడం కూడా ఓ ఆపరేషనా.. ఏమైనా శత్రువులను చంపారా..? అని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్మూ, కశ్మీర్‌లో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పుకుంటూ వచ్చారని.. కానీ పహల్గాంలో పర్యాటకుల మీద ఉగ్రవాదుల దాడులు చేయడంతో అక్కడి పరిస్థితులు బయటపడ్డాయని అన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఇప్పటికీ పట్టుకోలేదన్నారు. ఉగ్రవాదం నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు.. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను దేశ ప్రజలకు వివరించేందుకు పార్లమెంట్ సమావేశాలు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ భారత ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లో తీసుకున్నట్టుగా మాట్లాడటం ప్రధానమంత్రి దానిపైన నోరు మెదపకపోవడం సరైనది కాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, ఎస్.రమ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్, నాగన్న, జిల్లా కమిటీ సభ్యులు వై.గంగాధర్, నన్నేసాబ్, కొండ గంగాధర్, సుజాత, జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జనగణనతోపాటు కులగణన చేపట్టాలి

- మాజీ ఎంపి వీహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేపట్టాలని మాజీ ఎంపి వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. కులగణన చేపట్టకపోతే కేంద్ర ప్రభుత్వంతో యుద్ధం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనగణనతో బిసిలకు ఏం లాభమని ప్రశ్నించారు. ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి కూడా బిసిల అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నారని చెప్పారు. తానూ బిసినే అంటూ చెబుతున్న ప్రధాని మోడీ వారి గురించి మాట్లాడటం లేదన్నారు. జనగణన వల్ల బిజెపికి లాభం తప్ప బిసిలకు లాభం లేదని స్పష్టం చేశారు. కులగణన కోసం అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

త్వరలో ఇంటెల్‌లో భారీగా కార్మికుల తొలగింపు

శాన్‌ఫ్రాన్సిస్కో : ప్రముఖ టెక్ దిగ్గజం ఇంటెల్ భారీగా ఉద్యోగులు, కార్మికులను ఇంటికి పంపించే పనిలో ఉంది. ఇప్పటికే వేలాది మందిని తొలగించిన ఈ సంస్థ వచ్చే జులైలో మరింత మందిపై వేటు వేయడానికి సిద్ధం అవుతోంది. తదుపరి తొలగింపుల్లో ఫ్యాక్టరీలో పని చేసే 15-20 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం ఉండొచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. ఇంటెల్ నూతన సిఇఒగా లిప్ బు టాన్ మార్చిలో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన పొదుపు చర్యలకు ప్రణాళికలు రూపొందించారు. కంపెనీ విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం ఇంటెల్‌లో కొత్త విడత తొలగింపులు జులై మధ్యలో ప్రారంభమై నెలాఖరు నాటికి ముగిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నిర్ణయం చాలా బాధాకరమైనదని.. కానీ పరిశ్రమ సవాళ్లను పరిష్కరించడానికి, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో అవసరమనం ఇంటెల్ చిప్ మ్యానుఫ్యాక్చరింగ్ చీఫ్ నాగ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇంతక్రితం ఇంటెల్ 2024లో 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఇందులో ఒరెగాన్‌లో 3,000 మంది సిబ్బంది ఉన్నారు. మరోమారు ఒరెగాన్ ఉద్యోగులపై వేటు పిడుగు పడనుందని అంచనా.

ఎటిఎంల్లో పెరిగిన చిన్న నోట్ల లభ్యత

న్యూఢిల్లీ : ఎటిఎం కేంద్రాల్లో రూ.100, రూ.200 నోట్ల లభ్యతను పెంచాలన్న ఆర్‌బిఐ ఆదేశాలకు అనుగుణంగా బ్యాంక్‌లు నిర్ణయం తీసుకున్నాయి. సెప్టెంబర్ 30 నాటికి ఈ నోట్ల లభ్యత పెంచాలని ఆదేశించగా.. గడువుకు ముందే చిన్న నోట్ల లభ్యత 70 శాతానికిపైగా పెరిగిందని నగదు నిర్వహణ సంస్థ సిఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ వెల్లడించింది. గతేడాది డిసెంబర్‌లో 65 శాతంగా ఉన్న ఈ నోట్ల లభ్యత ప్రస్తుతం 73 శాతానికి చేరిందని పేర్కొంది. దేశంలో మొత్తం 2,15,000 ఎటిఎంలు ఉండగా.. 73,000 ఎటిఎం కేంద్రాలను సిఎంఎస్ నిర్వహిస్తోంది.



హైదరాబాద్ నుంచి ఇథియోపియాకు విమానం

- ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆఫ్రికా ఖండంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయినా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ఇథియోపియా నుంచి హైదరాబాద్‌కు నేరుగా ప్యాసింజర్ విమాన సర్వీస్ ప్రారంభించినట్లు ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ సిఇఒ మెస్ఫిన్ తస్యూ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మెస్ఫిన్ మీడియాతో మాట్లాడుతూ.. వారానికి మూడుసార్లు నడిచే ఈ విమాన సర్వీసును ఆడిస్ అబాబా బోల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ప్రభుత్వ సీనియర్ అధికారులు, రాయబారులు ప్రారంభించారన్నారు. ఆడిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు సోమ, బుధ, శనివారాలు, హైదరాబాద్ నుంచి ఆడిస్ అబాబాకు మంగళ, గురు, శనివారాల్లో రాకపోకలు ఉంటాయని వెల్లడించారు. ఇది తమ విమానాలు నేరుగా వెళ్లే ఐదో నగరం కానుందన్నారు. ఇప్పటికే ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నయ్ నగరాలకు తమ ఎయిర్‌లైన్స్ సేవలు నడుస్తోన్నాయన్నారు.

23న ఒప్పో కె13ఎక్స్ విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో తన కె సిరీస్‌లో కొత్త ఫోన్ కె13ఎక్స్ 5జిని జూన్ 23న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది నీరు, దుమ్ము నిరోధకాన్ని కలిగి ఉంటుందని తెలిపింది. బడ్జెట్ ధరలోనే మెరుగైన ప్రాసెసర్, అధిక బ్యాటరీ సామర్థ్యం, మన్నిక ఫీచర్లను కలిగి ఉంటుందని పేర్కొంది.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- ఫస్ట్ నైపుణ్య అభివృద్ధి కేంద్రం, సెట్విన్ ద్వారా మహిళలకు శిక్షణా కార్యక్రమాలు
- రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక
- పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి



సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు ఆర్థికంగా మరింతగా అభివృద్ధి చెందాలని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చిన మంత్రికి మంగళవారం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ నైపుణ్య అభివృద్ధి కేంద్రం, సెట్విన్ ద్వారా వివిధ స్వల్ప కాల కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమం కింద సెట్విన్ ద్వారా మహిళలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఆలోచనతో స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువజన శాఖ పరిధిలో ఉన్న సెట్విన్ ద్వారా మహిళలకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను పైలెట్‌గా తీసుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్టు తెలిపారు. స్త్రీ శక్తితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

నారాయణపేట జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహించే ముఖ్యమంత్రి పెట్రోల్ బంక్‌ను ప్రారంభించామన్నారు. ప్రతి జిల్లాలో పెట్రోల్ బంక్‌లు మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి తన నియోజకవర్గంలో పదో తరగతి పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన 3డీ యానిమేటెడ్ పుస్తకాలు పంపిణీని మార్గదర్శకంగా తీసుకుని మక్తల్ నియోజకవర్గంలోనూ 3718 మంది విద్యార్థులకు అంద చేసినట్టు తెలిపారు. దీంతో ఉత్తీర్ణత 100 శాతం పెరగడం గమనార్హం అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో చేపట్టిన 3డి యానిమేషన్ మెటీరియల్ వచ్చే సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టడానికి కృషి చేస్తామని సిఎం చెప్పినట్టు తెలిపారు. మక్తల్ నియోజకవర్గం అమరచింతలో 200 మంది మహిళలు డ్రెస్ మెటీరియల్ డిజైన్, తయారీ ఆర్డర్ చేసి ప్రతి నెలా రూ.12 వేల నుంచి 14 వేల వరకు సంపాదిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మెన్ లక్ష్మణ్ యాదవ్, గిరిధర్‌రెడ్డి, మల్లు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ్‌ఇన్ఫోకు రూ.474 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ : టెక్ సొల్యూషన్స్ ప్రొవైడర్ రామ్‌ఇన్ఫో కొత్తగా రూ.474 కోట్ల ఆర్డర్ దక్కినట్లు ప్రకటించింది. రాజస్థాన్ రెన్యూవెబుల్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి రూఫ్‌టాప్ సోలార్ ఫోటోవొల్టాయిక్ పవర్ ప్రాజెక్టు అందుకున్నట్లు పేర్కొంది. ఇది 73మెగావాట్ సామర్థ్యం కలిగి ఉందని తెలిపింది. దీన్ని ఏర్పాటు చేయడంతో పాటుగా 25 ఏళ్లు నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించింది.

భారత ఐఫోన్ ఎగుమతుల్లో 57 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది జనవరి నుంచి మే కాలంలో భారత్ నుంచి ఆపిల్‌కు చెందిన ఐఫోన్ల ఎగుమతులు 57 శాతం పెరిగి 2.04 కోట్లుగా నమోదయ్యాయని గ్లోబల్ రీసెర్చ్ సంస్థ ఓమ్‌డియా వెల్లడించింది. ఇందులో 77 శాతం యూనిట్లు అమెరికాకు తరలించబడ్డాయని తెలిపింది. గతేడాది ఇదే సమయంలో యుఎస్‌కు చేసిన ఎగుమతుల వాటా 54 శాతంగా ఉందని పేర్కొంది. యుఎస్‌కు ఎగుమతులు పెరగడంతో నెథర్లాండ్స్, చెక్ రిపబ్లిక్, బ్రిటన్, ఇటలీకి తగ్గాయని తెలిపింది. గతేడాది ఇదే జనవరి నుంచి మే కాలంలో 1.3 కోట్ల ఐఫోన్ల ఎగుమతులు జరిగాయి. ఆపిల్ ఐఫోన్లను భారత్‌లో ఫాక్స్‌కాన్, టాటా గ్రూపులు తయారు చేస్తున్నాయి.

బురిడీ కొట్టించి.. బంగారం అపహరణ

వృద్ధ దంపతులను మోసం చేసిన దొంగలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వృద్ధ దంపతులను బురిడీ కొట్టించి, బంగారం అపహరించిన సంఘటన మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాల మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు రాజవ్వ, గోవింద్‌ను ముగ్గురు ఆగంతకులు బురిడీ కొట్టించి రెండు తులాల బంగారు చైన్‌ను అపహరించుకుపోయారు. వారు తమ సమీప బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యాయానికి మంగళవారం మధ్యాహ్నం భైంసాకు వచ్చారు. స్థానిక పిప్రి కాలనీ బస్టాండ్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్విచక్ర వాహనంపై కాపు కాచి ఉన్న ముగ్గురు ఆగంతకులు వృద్ధ జంటను ఆపి తాము అధికారులమంటూ మాట్లాడారు. చోరీలు అధికమైన దృష్ట్యా బంగారు చైన్‌ను మెడలో నుంచి తీసివేసి లోపల పెట్టుకోవాలంటూ సూచించారు. దాంతో రాజవ్వ తన బంగారు చైన్‌ను మెడలో నుంచి తీయగా.. ఆగంతకుడొకడు పేపర్ పొట్లంలో పెట్టి ఇస్తానని నమ్మించి తీసుకున్నాడు. అదే సమయంలో మరో వ్యక్తి వారిని మాటల్లో పెట్టగా.. ఇంకొకడు బంగారు చైన్‌ను దాచిపెట్టి ముందుగాను తాను సిద్ధం చేసి ఉంచుకున్న మట్టి పెళ్లలు చుట్టిన పేపర్ కవర్‌ను వృద్ధులకు ఇచ్చి సంచిలో వేసుకోవాలని సూచించారు. వృద్ధురాలు వారు ఇచ్చి మట్టి పేపర్ కవరును సంచిలో వేసుకొని నడుచుకుంటూ బంధువుల ఇంటి వైపు వెళ్లింది. ఆ తర్వాత ఆగంతకులు బైక్‌పై అక్కడి నుంచి ఉడాయించారు. కొద్ది దూరం వెళ్లిన అనంతరం గోవింద్ పేపర్ పొట్లం తీసి బంగారు చైన్ వేసుకోవాల్సిందిగా భార్య రాజవ్వకు సూచించాడు. దాంతో ఆమె పొట్లం విప్పి చూడగా అందులో మట్టి, చిన్నపాటి కంకర కనిపించడంతో కంగుతిని తాము మోసపోయినట్టు గుర్తించి లబోదిబోమన్నారు. రోదిస్తూ వెళ్లి బంధువులకు చెప్పారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వృద్ధ దంపతుల నుంచి వివరాలు సేకరించారు. ఆగంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

హాఫ్ టైపు పామాయిల్ చెట్లకు పరిహారం ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ డిమాండ్
- పామాయిల్ ఫ్యాక్టరీలోకి అనుమతి నిరాకరణ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హాఫ్ టైపు పామాయిల్ చెట్లకు పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అప్పారావుపేట గ్రామంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ సందర్శనకు మంగళవారం వచ్చిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర బృందానికి తెలంగాణ ఆయిల్ ఫెడ్ యాజమాన్యం అనుమతి నికాకరించింది. దాంతో రాష్ట్ర బృందం ఫ్యాక్టరీ గేటు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సాగర్ విలేకరులతో మాట్లాడుతూ.. తమ బృందం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వేంసూరు, పెనుబల్లి, సత్తుపల్లి, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లోని నకిలీ, హాఫ్‌టైప్ బాధిత రైతుల పామాయిల్ తోటలను పరిశీలించిందని తెలిపారు. పామాయిల్ బాధిత రైతుల బాధలు వర్ణణాతీతమన్నారు. పామాయిల్ మొక్కలు నాటుకున్న మూడేళ్ల తరువాత ఫలసాయం చేతికందుతున్న ప్రణాళికతో సాగుచేసిన రైతుల ఆశలు అడియాసలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతుల గోడును కనీసం మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యాన అధికారులు, ప్రభుత్వం వినటానికి, చూడటానికి కూడా ఇష్టపడటం లేదన్నారు. బాధిత రైతులను శత్రువులుగా చూస్తున్నారని, అధికారులు చేసిన తప్పిదాలను రైతులపై రుద్ది అవినీతిపరులను కాపాడాలని ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శాస్త్రవేత్తలతో కూడిన విచారణ కమిటీ వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి వెన్నుముక రైతన్న విషయం మరిచి వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంలో కీలకమైన పామాయిల్ రైతును నిర్లక్ష్యం చేస్తే లక్ష్యం ఎలా చేరతారని ప్రశ్నించారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ.. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించడానికి తమ బృందానికి ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి అనుమతి నిరాకరించారని, ఫ్యాక్టరీలో జరుగుతున్న అవకతవకలు రైతులకు తెలుస్తాయన్న భయంతోనే తమను అనుమతించలేదా అని ప్రశ్నించారు. విజయవంతమైన అధిక ఆయిల్ రికవరీ వస్తున్న హారిజాంటల్ స్టరిలైజర్ టెక్నాలజీని వదిలి.. తక్కువ ఆయిల్ రికవరీ, ఎక్కువ ఎఫ్‌ఎఫ్‌ఏ వచ్చే వర్టికల్ స్టరిలైజర్ టెక్నాలజీకి రూ.30 కోట్లు ఖర్చు పెట్టిన విషయం భయటపడుతుందని భయంతోనే అనుమతించలేదా అని నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థను యాజమాన్యం ఒక ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీగా, స్వంత యాజమాన్య సంస్థగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. తమ సంఘం రైతుల పక్షాన ఉండి సమస్యలను ఎత్తి చూపుతూ పరిష్కారానికి పోరాటం సాగిస్తుందన్నారు. ఈ పర్యటనలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, యలమంచిలి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, నాయకులు మోరంపూడి పాండు, రావుల రాజబాబు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మినారాయణ, బ్రహ్మయ్య, మురహరి రఘు తదితరులు పాల్గొన్నారు.